సాక్షి అనంతపురం

గురువారం । 11 । ఏప్రిల్ । 2024

I



చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 40.6°/22.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. పడమటి దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎస్పీ రంజాన్ శుభాకాంక్షలు



ఎస్పీ అమిత్ బర్దర్

అనంతపురం: జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ అమిత్ బర్దర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సేవానిరతి, పవిత్రతలకు ప్రతీక రంజాన్ పర్వదినమని పేర్కొన్నారు. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. దైవ చింతన, భక్తిశ్రద్ధలతో కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ముస్లిం సోదరులు తమ ఇష్ట దైవాన్ని కొలవడం ఆదర్శప్రాయమన్నారు. అల్లాహ్ కృపా కటాక్షాలతో ఈ రంజాన్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరంలో ఆదర్శ (మోడల్) స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు బుధవారం విడుదలయ్యాయి. ఈనెల 21న అర్హత పరీక్ష ఉంటుందని డీఈఓ బి.వరలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు https://cse.ap.gov.in/ లేదా https://apms.apcfss.in/studentLogin. do వెబ్‌సైట్ల నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు/ ఇంగ్లీషు మాధ్యమాల్లో రాయొచ్చన్నారు.

కసాపురం వద్ద తెగిన విద్యుత్ లైన్

- గుర్తించిన పెట్రోలింగ్ గ్యాంగ్
- వేగంగా సరఫరా పునరుద్ధరణ


సాక్షి, అమరావతి: విద్యుత్ లైను తెగిన కారణంగా గుంతకల్లు వద్ద 132 కేవీ గుత్తి రిసీవింగ్ స్టేషన్(ఆర్ఎస్) సింగిల్ సర్క్యూట్ లైన్ బుధవారం ఉదయం 8:15 గంటలకు ట్రిప్ అయింది. ఈ మేరకు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు 'సాక్షి'కి తెలిపారు. గుత్తి గ్యాంగ్ ఫీడర్‌పై పెట్రోలింగ్ చేసినప్పుడు ఫేజ్ కండక్టర్ స్నాప్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఉదయం 8:20 గంటలకు బ్రేక్‌డౌన్ ప్రకటించారు. 132కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గుంతకల్లు–ఉరవకొండ ప్రాంత గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా కోసం 33కేవీ స్థాయి ఫీడర్ నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. రైల్వేకు సంబంధించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా 220 కేవీ లైన్ ద్వారా గుత్తి నుంచి అనుసంధానం చేశారు. గుంతకల్లు – కసాపురం గ్రామ రహదారి వద్ద బ్రేక్‌డౌన్ సైట్‌కు చేరుకున్న సాంకేతిక సిబ్బంది కండక్టర్ రెసిడెన్షియల్ ప్రాంతం (జర్నలిస్ట్ కాలనీ)లో పడిపోయిన దాదాపు 100 మీటర్ల కండక్టర్‌ను భర్తీ చేశారు. ఫేజ్ కండక్టర్ ఫీడర్‌ను సరిగ్గా నిలిపి మిడ్–స్పాన్ జాయింట్ వేశారు. మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం మధ్యాహ్నం 2.44 గంటలకు లైన్ ఛార్జ్ చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఫీడర్ సాధారణ స్థితికి చేరుకున్న వెంటనే గృహ, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పెద్దపప్పూరు: పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామంలో 136,137, పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎటువంటి సమస్య చోటు చేసుకున్నా సంబంధిత అధికారులకు తక్షణ సమాచారం అందించాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లా నేస్తం.. యువోత్సాహం

- యువన్యాయవాదులకు నెలకు రూ.5 వేల చొప్పున అందజేసిన ప్రభుత్వం
- మూడు సంవత్సరాల పాటు స్టైఫండ్
- ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల సాయం
- ప్రభుత్వ చేయూతతో పెరిగిన యువ లాయర్ల సంఖ్య



వైఎస్సార్ లా నేస్తం మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)

అనంతపురం: లా డిగ్రీ పూర్తయిన తర్వాత న్యాయవాదిగా స్థిరపడాలంటే రెండు, మూడు సంవత్సరాలు పడుతుంది. ఆ కాలంలో ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఉంటుంది. సీనియర్ న్యాయ వాదుల వద్ద జూనియర్‌గా చేరినా వెంటనే జీతం ఇవ్వరు. అందుకే చాలా మంది నిరుద్యోగులు లా చదివినా వెంటనే ప్రాక్టీసుకు వెళ్లరు. ఈ నేపథ్యంలో న్యాయవాద వృత్తి చేపట్టే వారికి ప్రారంభంలో ఆర్థిక అవరోధాలు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ లా నేస్తం' పథకం ప్రవేశపెట్టింది. జూనియర్ న్యాయవాదులకు వెన్నుదన్నుగా నిలిచింది.

సత్ఫలితాలు..

యువ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ వృత్తిలో స్థిరపడడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ లా నేస్తం' సత్ఫలితాలనిచ్చింది. 2019 తర్వాత జూనియర్ న్యాయవాదుల సంఖ్య గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తామని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారం లోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం 'వైఎస్సార్ లా నేస్తం' అమలు చేశారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.60 వేల ప్రకారం మూడేళ్లలో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇలాంటి పథకం కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అమలవుతుండడం విశేషం. దేశంలో ఏ రాష్ట్రమూ ఇలాంటి పథకాన్ని అమలు చేయలేదు.

వైఎస్సార్ లా నేస్తం పథకం కింద లబ్ధిదారుల వివరాలు..

సంవత్సరం	జూనియర్ లాయర్లు	మొత్తం (రూ.లలో)
2019-20	59	35 లక్షలు
2020-21	25	15 లక్షలు
2021-22	44	26 లక్షలు
2022-23	45	27 లక్షలు
2023-24	20	12లక్షలు
మొత్తం	193	1.15 కోట్లు

రుణపడి ఉంటా..



లా డిగ్రీ పూర్తి చేసిన వెంటనే న్యాయవాద వృత్తి చేపట్టా. వైఎస్సార్ లా నేస్తం కింద నాకు ఏడాదికి రూ.60 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటా. ఈ డబ్బుతో నా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడంతో పాటు పుస్తకాలు కొనుగోలు చేశా. తల్లిదండ్రుల మీద ఆధార పడకుండా నాకు ఎంతగానో ఉపయోగపడింది. ప్రతి రోజూ కోర్టుకు వెళుతూ న్యాయవాద వృత్తిలో రాణిస్తున్నా. ఈ పథకం కేవలం మన రాష్ట్రంలోనే అమల్లో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ఇది ప్రతిపాదనగా మాత్రమే ఉంది. మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ అభినందనీయం.

– డి. సూర్యచంద్ర యాదవ్, న్యాయవాది

ప్రోత్సాహకంగా నిలిచింది



జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం ప్రోత్సాహకంగా నిలిచింది. ఆర్థికంగాను, వృత్తిపరంగా నిలదొక్కుకొనేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంచి ఆలోచనతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తున్నారు.గతంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వం కూడా న్యాయవాదుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు.

– కుసుం స్వాతి, యువ న్యాయవాది

అపురూపమైన బహుమతి



ఇప్పుడిప్పుడే న్యాయవాద వృత్తి ప్రారంభించిన జూనియర్లకు లా నేస్తం ద్వారా నెలకు రూ.5 వేలు అందజేయడం అపురూపమైన బహుమతిలాంటిది. జూనియర్ న్యాయవాదులకు ఎటువంటి కేసులు అందవు. నేర్చుకునే సమయంలో ప్రభుత్వం రూ.5 వేలు అందించడం వల్ల మా లాంటి వారికి చాలా మేలు కలుగుతుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు.

– ఎం. పురుషోత్తం, జూనియర్ న్యాయవాది

న్యాయవాదులకు ఎంతో మేలు



2010కి ముందు జూనియర్ న్యాయవాదులు అధికంగా ఉండేవారు. ఆ తర్వాత క్రమంగా వారి సంఖ్య తగ్గింది. 2018 నాటికి న్యాయవాద వృత్తి అంటేనే భయంతో చాలా మంది ఆసక్తి చూపలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం లా నేస్తం కింద ఇప్పటి వరకు రూ.42 కోట్ల వరకు విడుదల చేసి అండగా నిలిచారు. న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు.

– పొల్ల అక్కులప్ప, న్యాయవాది, అనంతపురం

'బాబువి దిగజారుడు రాజకీయాలు'



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

తాడిపత్రి: దిగజారుడు రాజకీయాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. బుధవారం తాడిపత్రిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబువి మోసపూరిత హామీలన్నారు. అధికారం కోసం ఎంతటి నీచానికైనా దిగజారే ఘనుడు బాబు అని దుయ్యబట్టారు. గతంలో వలంటీర్లపై విషం చిమ్మి, నేడు సిగ్గులేకుండా వారికి రూ. 10 వేలు పారితోషికం ఇస్తాం, ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తామనడం బాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామన్న ఆయన నేడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. వలంటీర్లను ప్రజలకు దూరంగా ఉంచాలని, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇప్పుడు కపట ప్రేమను చూపుతున్నారని మండిపడ్డారు. బాబు మాటలు నమ్మి మోసపోయేందుకు వలంటీర్లు అమాయకులు కారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్ రూ. 4 వేలు, దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలు చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఆయన చేసిన మోసాన్ని అవ్వాతాతలు, దివ్యాంగులు మరిచిపోలేదన్నారు. బాబు హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా నిన్ను నమ్మం బాబూ అంటూ నినదిస్తున్నారన్నారు. కేవలం రెండు పేజీల మేనిఫెస్టో ప్రకటించి, తూచ తప్పకుండా అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన విశ్వసనీయత చాటుకున్నారని పైలా పేర్కొన్నారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

అనంతపురం అర్బన్: 'ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల చేస్తాం. ఆ వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నిర్వహణపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి తాను ఆర్‌ఓగా, ఏఆర్‌ఓగా పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన రోజునే పరిశీలన చేపట్టి ఏవైనా వివరాలు కావాల్సి ఉంటే తెలియజేయాలన్నారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డి, పరిపాలనాధికారి అంజన్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ అమిత్ బర్దర్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 26న స్క్రూటినీ, ఉపసంహరణ గడువు 29 వరకూ ఉంటుందన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. మే 12 వరకూ హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉమాపతి, పవన్ కుమార్, అంజయ్య, ఇమామ్‌వలి, ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూద్దాం

తాడిపత్రి అర్బన్: మే13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేద్దామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. తాడిపత్రిలో బుధవారం ఆయన పర్యటించారు. కడప రోడ్డులోని శివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. మున్సిపల్ ఆడిటోరియంలో సెక్టోరియల్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, ర్యాంపు, ఫర్నిచర్, విద్యుత్, టాయ్‌లెట్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఓటర్ల కోసం నిర్వహించిన బైక్ అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. సీబీ రోడ్డులో ఓటర్లతో మాట్లాడారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, అనంతపురం మేయర్ మేఘస్వరూప్, ఆర్వో రామభూపాల్‌రెడ్డి, డీఎస్పీ గంగయ్య, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

రాప్తాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పండమేరు వంకలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో ఉదయం పూటే పనులు చూపాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు రాప్తాడు బీసీ కాలనీ, ప్రసన్నాయపల్లిలో తాగు నీటి సమస్య నెలకొందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 14 వరకూ ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, చిరునామా కూడా మార్చుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఏపీడీ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈద్–ఉల్–ఫితర్

- ఉపవాస దీక్షలు ముగించిన ముస్లింలు
- రంజాన్‌కు ముస్తాబైన మసీదులు

అనంతపురం కల్చరల్: జిల్లావ్యాప్తంగా గురువారం ఈద్–ఉల్–ఫితర్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. మానవాళి సంక్షేమం కోసం మహమ్మద్ ప్రవక్త (స) ద్వారా పవిత్ర ఖురాన్ ఆవిష్కారమైన రంజాన్ మాసం 'ఈద్–ఉల్–ఫితర్' రాకతో ఘనంగా ముగిసింది. భగవంతుని దృష్టిలో పేద, ధనిక వ్యత్యాసం లేదని, అందరూ సమానులేనని నిరూపించిన ఉపవాస దీక్షలను బుధవారం సాయంత్రం ఇఫ్తార్‌తో ముస్లింలు ముగించారు. 30 రోజులుగా స్నేహానికి, ఆప్యాయతలకు ప్రాధాన్యమిస్తూ కులమతాలకతీతంగా సర్వమత సహనంతో ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా మసీదులు ముస్తాబయ్యాయి.



విద్యుద్దీపాలంకరణలో అనంతపురంలోని మినార్



ఉపవాస దీక్ష విరమిస్తున్న ముస్లింలు

రమణీయం.. నెట్టికంటుడి రథోత్సవం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవం బుధవారం రమణీయంగా సాగింది. ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించిన అర్చక బృందం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ముందు భాగంలో రథాన్ని నిలిపి హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామిని రథంలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ భద్రాజీ, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ నారికేళాలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. పురవీధుల్లో అడుగడుగునా భక్తులు స్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



అశేష భక్తజనం నడుమ సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్) సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

దూసుకొచ్చిన మృత్యువు

- బైకును ఢీ కొన్న కారు
- అన్నదమ్ముల దుర్మరణం

గుత్తి రూరల్: వారు పేరుకు అన్నదమ్ములైనా స్నేహితుల్లా ఉండేవారు. ఎక్కడికెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. అందులో ఒకరికి ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. పెళ్లి చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. పిల్లలు కలిసిమెలిసి ఉండడం చూసి తల్లిదండ్రులు నిత్యం ఎంతో ఆనందపడేవారు. అయితే, రోడ్డు ప్రమాద రూపంలో దూసుకొచ్చిన మృత్యువు పిల్లలిద్దరినీ మింగి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్రవాహనాన్ని ఎదురుగా కారు ఢీకొనడంతో అన్నదమ్ములు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రాచమల్లు రామసుబ్బారెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులకు రాచమల్లు చంద్రశేఖర్‌రెడ్డి(26),శివానందరెడ్డి(24) సంతానం. చంద్రశేఖర్‌రెడ్డి తల్లిదండ్రులతో కలసి వ్యవసాయం చేస్తుండగా శివానందరెడ్డి గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రాగా, త్వరలో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే బుధవారం గుత్తి మండలం బాచుపల్లి గ్రామంలో బాట సుంకులమ్మ జాతరకు శివానందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి వచ్చారు. జాతరలో భోజనం చేసుకొని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. మార్గమధ్యంలో ఎంగిలిబండ శివారులో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ కారు అదుపుతప్పి నేరుగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న రంగనాథ, చంద్రశేఖర్, రేణుక, శాంతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. బొలెరో వాహనంలో చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనాస్థలిని సీఐ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఎంత పనిచేశావు దేవుడా..

ప్రమాద విషయం తెలుసుకున్న రామసుబ్బారెడ్డి హుటాహుటిన ఆస్పత్రికి వచ్చారు. మృతదేహాల వద్ద గుండెలవిసేలా రోదించారు. దేవుడా ఎంత పని చేశావయ్యా అంటూ కన్నీరు మున్నీరయ్యారు. ఇద్దరు పిల్లలు కలసిమెలసి తిరుగుతుంటే ఎంతో సంతోషించేవాడిని, అంతలోనే ఇంత పెద్ద శిక్ష వేశావు కదా దేవుడా అంటూ రోదించారు. తల్లి ఉమామహేశ్వరమ్మకు కుమారులు మృతి చెందిన విషయం చెప్పలేదని వారి బంధువులు తెలిపారు.





శివానందరెడ్డి (ఫైల్), చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


గాయపడిన మహాత్మ

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవానితిప్ప పంచాయతీ కపటలింగనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం కర్ణాటక సరిహద్దులోని బసాపురానికి కపటలింగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొల్ల మహాత్మ వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఉన్న ఆయనను టీడీపీ నేతలు కురుబ శివన్న, ఆది, మంజన్న, గౌడప్ప, మారేష్ అడ్డుకుని గొడవ పెట్టుకున్నారు. మాటలతో రెచ్చగొట్టి విచక్షణారహితంగా దాడి చేశారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన మహాత్మను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడికి పాల్పడినట్లుగా సమాచారం. ఘటనపై బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మసీదులో చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని మెయిన్ బజారులో ఉన్న సున్నీ రోషన్ మసీదులో చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు మసీదులోకి ప్రవేశించారు. హుండీలో ఉన్న నగదు అపహరించుకెళ్లారు. చోరీ దృశ్యాలు సీసీకెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. హుండీలో భక్తుల సమర్పించిన రూ.15 వేలను అపహరించుకెళ్లినట్లుగా మసీదు ప్రెసిడెంట్ జీఎం బాషా చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నబీరసూల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో మేకల కాపరి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (69) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్న వన్నూరుస్వామి మంగళవారం ఎండ వేడిమికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని మృతుడి భార్య గంగమ్మ తెలిపారు.

మీరు ప్రచారానికి రావొద్దు!

- మీరొస్తే మైనార్టీ ఓట్లు దూరమవుతాయి
- బీజేపీ నేతలకు స్పష్టం చేసిన టీడీపీ అభ్యర్థులు
- అంతర్గతంగా పనిచేయాలని సూచన
- రాయదుర్గం, ఉరవకొండలో టీడీపీ తీరుపై బీజేపీ శ్రేణుల విస్మయం
- 'పొత్తు ధర్మం' ఇదేనా అంటూ ఆవేదన



రాయదుర్గం/ఉరవకొండ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ప్రస్తుత ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. మూడు పార్టీల శ్రేణులు కలసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తాయని ఆ పార్టీల అధినేతలు తరచూ ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బీజేపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ అభ్యర్థులు పూర్తిగా విస్మరిస్తున్నారు. 'పొత్తు ఉంటే ఉండనీ.. మీరు మాత్రం మా వెంట రావొద్దు. మీరొస్తే వచ్చే ఓట్లు కూడా పోతాయి. ముఖ్యంగా మైనార్టీ ఓట్లు దూరమవుతాయి' అంటూ తెగేసి చెబుతున్నారు. ఈ విషయంలో కొందరు బీజేపీ నేతలు సర్దుకుపోతున్నప్పటికీ..కేడర్ మాత్రం టీడీపీ అభ్యర్థుల తీరుపై మండిపోతోంది. ఇదేనా పొత్తు ధర్మం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

రాయదుర్గంలో పొత్తు 'జిత్తులు'

రాయదుర్గం నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కాపు రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి.. ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉండేవారు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. నిత్యం విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకునేవారు. కానీ ఈసారి కాపు రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించడంతో ఆయన బీజేపీలో చేరిపోయారు. పొత్తులో భాగంగా ఆయన టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తరఫున ప్రచారం చేయాల్సి ఉంది. అయితే.. నిన్న మొన్నటి వరకు తీవ్రస్థాయిలో దూషించుకున్న ఈ ఇద్దరు నేతలు ఇప్పుడు కలసి తిరిగితే ప్రజల్లోకి ప్రతికూల సంకేతాలు వెళతాయనే భావనకు వచ్చారు. దీనికితోడు మైనార్టీల ఓట్లు దూరమవుతాయనే ఉద్దేశంతో కాపుతో పాటు ఇతర బీజేపీ నేతలను కూడా ప్రచారానికి దూరం పెడుతున్నారు. ఉమ్మడిగా తిరిగితే తలెత్తే పరిణామాలపై ఇటీవల బళ్లారిలో కాలవ, కాపు కలసి చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కాలవ ప్రచారానికి కాపు రావడం లేదన్న చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా సాగుతోంది.

ఉరవకొండలోనూ అదే తీరు

బీజేపీతో దోస్తీ కోసం చంద్రబాబు అష్టకష్టాలు పడితే ఉరవకొండ నియోజకవర్గంలో మాత్రం టీడీపీ నేతలు కమలం పార్టీని పూచిక పుల్లలా చూస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఎక్కడా తన వెంట ప్రచారానికి బీజేపీ నాయకులను తీసుకెళ్లడం లేదు. మైనార్టీలు దూరమవుతారన్న భయంతో ప్రచారానికి రావొద్దని బీజేపీ నాయకులకు కరాఖండీగా చెప్పినట్లు సమాచారం. కేవలం నలుగురైదుగురు జనసేన నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న కేశవ్‌కు.. తమ సేవలు అవసరం లేదా అంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఆయన తీరుపై బీజేపీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు టీడీపీ, బీజేపీ, జనసేనలకు ఓటు వేసే ముందు ముస్లింలు జాగ్రత్తగా ఆలోచించాలని, టీడీపీకి ఓటు వేస్తే మతతత్వ బీజేపీకి వేసినట్లేనని ఏపీ ముస్లిం మేధావుల సంఘం కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తోంది.

'ఏఆర్ ఎస్‌ఐ నుంచి రక్షణ కల్పించండి'

అనంతపురం టవర్‌క్లాక్: ఏఆర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌కు చెందిన సాకే అంజలి కోరారు. బుధవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం డీపీఆర్‌ఓ కార్యాలయం సమీపంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 14వ బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్‌ఐ బూర్గుల చంద్రశేఖర్ తనను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని వాపోయింది. ఈ అంశంపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదని, ఈ క్రమంలోనే మరోసారి బుక్కరాయసముద్రానికి పిలుచుకెళ్లి అక్కడ తనపై అత్యాచారం చేసినా కనీసం కేసు కూడా నమోదు చేయకుండా తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు జరిగిన అన్యాయాన్ని గతంలో పనిచేసిన ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. ఆ సమయంలో తనను చంపడానికి మారణాయుధాలతో ఇంటికి వచ్చాడని, ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డు అయ్యాయని వివరించింది. చంద్రశేఖర్ నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం నూతన ఎస్పీని కలసి ఫిర్యాదు చేశానని, ఇప్పటికీ తనకు న్యాయం చేకూరకపోతే ఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకునేందుకు సైతం వెనుకాడబోనని హెచ్చరించింది. ఈ సందర్భంగా ఆమెతో పాలు ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు పోలా వీరా, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతుడు పురుషోత్తం రెడ్డి

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి (30) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు, బంధువులు తెలిపారు. మేనమామ నల్లపరెడ్డి, ఆయన భార్య నాగరత్నమ్మ మాట్లాడుతూ... బుధవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటి దగ్గరే ఉన్నాడు. అనంతరం నల్లాలమ్మ గుడి వెనుక దొడ్డి వద్దకు వెళ్లడంతో అక్కడి నుంచి నల్లపరెడ్డి ఇంటికి చేరుకుని ముసర నీళ్లు తీసుకెళ్లి దొడ్లోని పాడి పశువుల కోసమని తొట్లో పోశాడు. ఆ సమయంలో మంచంపై పురుషోత్తం రెడ్డి పడుకుని ఉండడం గమనించాడు. నాలుగో సారి ముసర నీళ్లను తెచ్చేందుకు వెళుతుండగా సమీప బంధువు, పురుషోత్తంరెడ్డి స్నేహితుడు ఎదురు రావడంతో మంచంపై నిద్రిస్తున్నాడని తెలిపి, లేపి ఇంటికి పిలుచుకురమ్మని చెప్పి నల్లపరెడ్డి ఇంటికి చేరుకున్నాడు. ఎంతలేపినా పురుషోత్తం రెడ్డి లేవకపోవడంతో విషయాన్ని నల్లపరెడ్డికి చేరవేశాడు. వెంటనే నల్లపరెడ్డి, బంధువులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు గ్రహించి, సమాచారం అందివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మునిస్వామి తెలిపారు. కాగా, మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

మానసిక క్షోభతో వలంటీర్ మృతి


మృతుడు చంద్రానాయక్

పుట్టపర్తి అర్బన్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సాగిస్తున్న దుష్ప్రచారంతో తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తూ ఓ వలంటీర్ మృతి చెందాడు. వివరాలు... పుట్టపర్తి మండలం పెడపల్లి చిన్న తండాకు చెందిన గడ్డం చంద్రానాయక్ (38)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో చంద్రానాయక్ ప్రజా సేవ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులున్నా ఓపికగా భరిస్తూ గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చారు. గత కొంత కాలంగా తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తీసేస్తామని, వలంటీర్లపై కేసులు నమోదు చేస్తామంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేనాన అధినేత పవన్‌కళ్యాణ్ బెదిరింపులకు దిగడంతో చంద్రానాయక్‌లో ఆత్మస్థైర్యం లోపించింది. ఇదే అంశాన్ని పలువురితో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి. అయినా వలంటీర్‌గా తన బాధ్యతను ఎంతో సమర్థవంతంగా నిర్వరిస్తూ వచ్చారు. వలంటీర్లపై పగబట్టిన చంద్రబాబు... ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మరింత ద్వేషపూరితంగా వ్యవహరిస్తూ నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల వ్యవస్థను నైతికంగా దెబ్బతీశారు. దీంతో రెండు నెలలుగా ఇంటికే పరిమితమైన చంద్రానాయక్... ఇకపై తమకు గౌరవ వేతనం అందదేమోననే మానసిక క్షోభకు లోనయ్యాడు. ఈ వేదనలోనే బుధవారం ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో భార్య లలితాబాయి, ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేని తమకు దిక్కెవరు? కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి అంటూ లలితాబాయి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. తల్లిదండ్రులు సైతం అనారోగ్యంతో మంచాన పడ్డారని, ఈ స్థితిలో పిల్లలు, వృద్ధులను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదంటూ బోరున విలపించింది.

రాయలసీమ షర్బత్.. నన్నారి

- వేసవి తాపానికి మంచి ఉపశమనం
- నన్నారిలో ఔషధ గుణాలెన్నో..


నన్నారి వేర్లు


గాండ్లపెంటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నన్నారి బాటిళ్లు

కదిరి: వేసవి ఎండలు మండుతున్నాయి. ఎండ వేడిమి నుంచి కాసింత ఉపశమనం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూల్ డ్రింక్ దుకాణాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. పైగా డ్రింక్స్ తాగుతున్న వారిలో అత్యధికులు నన్నారి షర్బత్‌నే ఇష్టపడుతుండడం గమనార్హం. రాయలసీమ జిల్లాల్లో లభించే ఎన్నో ఔషధ గుణాలున్న సుగంధి పాల చెట్టు వేర్ల నుంచి నన్నారి షర్బత్ తయారు చేస్తారు. వీటిని ఈ ప్రాంతంలో నన్నారి వేర్లు అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఈ వేర్లు ఎక్కువగా లభిస్తాయి.

వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

కదిరి ప్రాంత వాసులు కొందరు దశాబ్దాలుగా నన్నారి తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఇక్కడి నుంచి నన్నారి బాటిళ్ల రూపంలో ఎగుమతి అవుతోంది. ఈ ప్రాంతం నుంచి సౌదీకి వెళ్లే వారు కూడా అక్కడి వారి కోసం తమ వెంట నన్నారి బాటిళ్లను తీసుకెళుతుండడం విశేషం. లీటర్ నన్నారి బాటిల్ ప్రస్తుతం రూ.150తో విక్రయిస్తున్నారు.

వట్టి వేర్ల నుంచి తయారీ..

దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన నన్నారి షర్బత్‌ను సుగంధిపాల చెట్టు వేర్ల నుంచి తయారు చేస్తారు. ముందుగా సేకరించుకున్న చెట్టు వేర్లను చిన్నచిన్నముక్కలుగా చేసి, ఎండబెడతారు. తర్వాత వాటిని రాత్రంత నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఆ నీరు సగమయ్యే వరకూ రెండు, మూడు గంటల పాటు మరగనిస్తారు. చల్లార్చి వడపోసిన ఆ మిశ్రమానికి తగినంత పంచదార కలిపి మరోసారి బాగా వేడి చేస్తారు. అది కొద్దిపాటి పాకంగా మారిన తర్వాత తీసి బాటిళ్లలో నింపి అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఇలా తయారు చేఉసిన షర్బత్‌ను ఓ గ్లాసులో రెండు స్పూన్ల చొప్పున వేసుకుని దానికి సగం నిమ్మకాయ రసం, చల్లని సోడా కలిపి అందజేస్తే రుచి అదిరిపోతుంది. దీనికి నీళ్లలో నానబెట్టిన సబ్జా గింజలను కలిపి సేవిస్తే శరీర ఆరోగ్యానికి ఇంకా మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. నన్నారిలోని ఔషధ గుణాలు శరీర ఉష్ణోగ్రతను బాగా తగ్గిస్తాయని అంటున్నారు.

ఆల్ టైమ్ మంచి గిరాకీ



నేను పదేళ్లకు పైగా నన్నారి వ్యాపారం చేస్తున్నా. కువైట్‌కు వెళ్లే వారు కూడా మా దగ్గర నుంచి నన్నారి కొనుగోలు చేసుకుని అక్కడికి తీసుకెళుతుంటారు. ఎండాకాలంలోనే కాదు... సీజన్ ఏదైనా నన్నారికి మంచి డిమాండ్ ఉంటోంది. గతంలో ఒక బాటిల్ నన్నారి షర్బత్‌ను రూ.100తో అమ్మేవాళ్లం. ఇప్పుడు రూ.150 చొప్పున విక్రయిస్తున్నాం. నన్నారి ఒక గ్లాసు రూ.25 అమ్ముతున్నాం.
– మహబూబ్‌బాషా, నన్నారి వ్యాపారి, గాండ్లపెంట

నన్నారి బెస్ట్



నన్నారి జ్యూస్ ఎక్కువగా దొరికేది మన రాయలసీమలోనే. బహుళ జాతి కంపెనీల డ్రింక్స్ కన్నా సహజ సిద్ధంగా లభించే నన్నారి ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది శరీర ఉష్ణోగ్రతను బాగా తగ్గిస్తుంది. దీని తయారీకి ఉపయోగపడే సుగంధి పాల చెట్టుకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. నిల్వ చేసిన ధాన్యంలోనూ ఒకట్రెండు నన్నారి వేర్లు ఉంచితే ధాన్యం పురుగు పట్టదు.
– డాక్టర్ మదన్‌కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్, కదిరి

వైభవంగా సుంకులమ్మ రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం సుంకులమ్మ అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. మధ్యాహ్నం మడుగు తేరు లాగిన అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ మూర్తిని అధిష్ఠింపజేసి, ఊరు బయట ఉన్న రాములమ్మ ఆలయం వరకూ లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ఉత్సవాన్ని ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య, అర్చకులు మనోహర్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

ఘనంగా కోటకొండ తిరునాల

పెద్దవడుగూరు: మండలంలోని గోపురాజుపల్లి సమీపంలో వెలసిన కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మొళకతాళ్ల, గోపురాజుపల్లి, చిత్రచేడు, చిట్టూరు, రాంపురం, చిన్నవడుగూరుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. పన్నారపు బండ్లతో రైతులు సందడి చేశారు. బుధవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తొమ్మిది మంది సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యల్లో భాగంగా బుధవారం శింగనమల నియోజకవర్గ పరిధిలో ఏడుగురు వలంటీర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో నార్పల 1, 2వ సచివాలయల పరిధిలోని వలంటీర్లు ఎస్.షకీలా, ఎ.సరస్వతి, పి.హారిక, కె.శాంతకుమారి, ఎస్.ధనలక్ష్మి, టి.లావణ్య, టి.ఈశ్వరమ్మ, నార్పల మండలం సిద్దరాచర్ల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ డి.దామోదర్, రాప్తాడు మండలం బొమ్మేపర్తి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.రమణారెడ్డి ఉన్నారు.

దుప్పి మాంసం విక్రేత అరెస్ట్

గోరంట్ల: దుప్పి మాంసం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. బుక్కపట్నం అటవీ శాఖ రేంజర్ శ్రీనివాసరెడ్డి తెలిపిన మేరకు... గోరంట్ల మండలం వెంకటరమణపల్లికి చెందిన వడ్డే రామచంద్రప్ప మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో దుప్పిని వేటాడి బావి సమీపంలో మాంసాన్ని విక్రయానికి ఉంచాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని రామచంద్రప్పను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కిలోల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, రేంజర్ కార్యాలయానికి తరలించారు.

'అమ్మ ఒడి' సల్లంగ ఉండగా...



'అమ్మ ఒడి' సల్లంగా ఉండగా ఇలాంటి ఎండలు మమ్మల్ని ఏమీ చేయలేవనే ధైర్యం వారిది. చల్లని 'విద్యా దీవెన'లతో ఉన్నత శిఖరాలు చేరుకోవడమే లక్ష్యంగా బడిలో తారల్లా మెరిశారు. శిశిరం వెనుకే వసంతం ఉందని, ప్రకృతి ధర్మానికి తాము వ్యతిరేకులం కాదంటూనే బడి వీడిన తర్వాత మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇంటి దారి పట్టారు. ఒంటి పూట బడుల నేపథ్యంలో రోజూ ఇది నిత్యకృత్యమే అయినా విద్యార్థుల్లో ఏదో తరగని ఉత్సాహం. వారి ఆత్మస్థైర్యం ముందు సూరీడు సైతం వెలవెలబోయాడు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్‌లో బుధవారం మధ్యాహ్నం తలపై చున్నీలు, టోపీలు, పుస్తకాలు పెట్టుకుని ఆశావాదుల్లై అడుగు ముందుకేస్తున్న విద్యార్థులను చూసి పలువురు ఆశ్చర్యపోయారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



ఓటు అభ్యర్థిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యం. ప్రజల పక్షాన నిలచిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. బుధవారం స్థానిక రహమత్ నగర్‌లోని గౌసియా మసీదు పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన పథకాలను వివరించి, ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, అధికార ప్రతినిధి ఖాజా, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్, మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, రమహత్ నగర్ డివిజన్ కన్వీనర్ సుఖేష్, మైనార్టీ నాయకులు నదీమ్, జావిద్, షుకూర్, ఇమ్రాన్, శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ గ్రాంట్ మంజూరుపై హర్షం



వీసీ కే.హుస్సేన్ రెడ్డిని అభినందిస్తున్న బోధనేతర సంఘం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి రూ.31 కోట్ల బ్లాక్‌గ్రాంట్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ నుంచి ఈ నిధులను విడుదల చేశారు. వర్సిటీ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు చెల్లించడానికి వీలుగా బ్లాక్ గ్రాంట్ కేటాయిస్తారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు జీతాలు చెల్లించడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ విడుదల కావడంపై బోధనేతర సంఘం ఎస్కేయూ అధ్యక్షుడు డి. ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శివశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. వర్సిటీకి బ్లాక్‌గ్రాంట్ నిధుల విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఇందుకు కృషి చేసిన వీసీకి ధన్యవాదాలు తెలిపారు.

దుస్తుల పంపిణీ



అంధ విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగుప్ప వెంకటేశ్వర్లు తన కుమారుడు సిరిగుప్ప ఆదిత్య జన్మదినం, వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ఉన్న అంధుల ఆశ్రమంలోని పేద విద్యార్థులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. 41 మంది అంధ విద్యార్థులకు దుస్తులు అందజేసి, దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సిరిగుప్ప జ్యోతి, సిరిగుప్ప ఆదిత్య, సిరిగుప్ప మేఘన, ఆనంద్‌బాబు, గీతక్క, సుప్రీత, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో దరఖాస్తుకు నేడు తుది గడువు

ఆత్మకూరు: కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ లీమారోజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడిమానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులం, ఆదాయ, స్టడీ తదితర ధ్రువీకరణ పత్రాలను పొందుపర్చాలన్నారు.

మోసం చేయడమే బాబు నైజం

- చంద్రబాబు పాలనంతా అవినీతి, అక్రమాలే
- ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, శంకర నారాయణ



పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, మాలగుండ్ల శంకర నారాయణ

అనంతపురం రూరల్: చంద్రబాబు పాలనంతా అవినీతి అక్రమాలే. అధికారం కోసం మోసపూరిత హామీలు గుప్పించడం అధికారంలోకి రాగానే వాటిని విస్మరించి ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, శంకర నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం ఎవరినైనా మోసం చేయడానికి చంద్రబాబు వెనుకాడరన్నారు. బుధవారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహలక్ష్మి శ్రీనివాసులుతో కలసి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లను తీవ్రంగా కించపరిచిన చంద్రబాబు.. తాను అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు వలంటీర్లకు రూ.10 వేలు కంటే ఎక్కువ ఇస్తానన్నా నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. గతంలో బీజేపీ, జనసేన నాయకులను అవమానించిన చంద్రబాబు ఇప్పుడు వారితోనే పొత్తు పెట్టుకొని ఎన్నికలకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం చంద్రబాబు ఎంతటి నీచానికైనా పాల్పడుతారని అర్థమవుతుందన్నారు. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేశారో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దొంగ హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

అనంతపురం నగరానికి దీటుగా నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఏ.నారాయణపురం పంచాయతీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రీజనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, మల్లెల వేణుగోపాల్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముస్లిం మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యం, కరుణ, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని.. రంజాన్ అంటే కేవలం ఉపవాస దీక్షలు మాత్రమే కాదని, మనిషిలోని చెడు భావాలు, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ అన్నారు. ఐక్యమత్యంతో ఉండటం, పేదలకు వారు సంపాదించిన డబ్బులో (జకాత్ నూటికి రూ.రెండున్నర రూపాయలు) సాయం చేయడం ఈ పండుగ విశిష్టత అని పేర్కొన్నారు. ఈ రంజాన్ పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంతోషంగా జరుపుకోండి

'రంజాన్ పండుగను మైనార్టీ సోదరులందరూ సంతోషంగా జరుపుకోవాలని మేయర్ వసీం పేర్కొన్నారు. ఈ మేరకు మేయర్ క్యాంపు కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముస్లిం మైనార్టీ సోదరులందరూ 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షల్లో ఉండి, రంజాన్ వేడుక నిర్వహించుకోవడం అల్లాహ్ తరఫున లభించిన గొప్ప బహుమతి అన్నారు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని, ఇతరుల పట్ల దయ కరుణ జాలి కల్గి ఉండాలన్నారు. ముస్లింలకు అత్యంత పవిత్ర మాసమైన రంజాన్‌లో ఎంతో కఠోర దీక్షతో ఉపవాసాలను ముగించడం అల్లాహ్ నుంచి లభించే గొప్ప బహుమతి అన్నారు. రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్థనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని అల్లాహ్ ఆశీర్వాదాలు పొందాలన్నారు.

రూ.60 లక్షల పన్ను వసూలు

అనంతపురం కార్పొరేషన్: ఇంటి పన్ను రాయితీపై అసెస్‌మెంట్‌దారుల నుంచి స్పందన వస్తోంది. బుధవారం తొలి రోజు నగరంలోని వివిధ కౌంటర్ల నుంచి రూ.60 లక్షల వరకు ఇంటి పన్ను వసూలైంది. ఉదయం 8 గంటల నుంచి నగరపాలక సంస్థ, 1, 39, 40,41, 54, 64 తదితర వార్డు సచివాలయాల్లో ఇంటి పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (2024–25) ఇంటి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు ఇంటి పన్ను రాయితీతో చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్



మందులు పంపిణీ చేస్తున్న సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు

అనంతపురం టౌన్: జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజుకు రోజుకు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్ పెట్టవచ్చని ప్రభుత్వ హోమియో వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని పాతూరులోని విద్యుత్ పవర్ ఆఫీసులో వడదెబ్బపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు హోమియో పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమాన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మాట్లాడుతూ.. అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, గుండె వేగంగా కొట్టుకోవడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఎండలో బయటకు తిరిగే వారు నీటి శాతం అధికంగా ఉండే పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, తదితర వాటిని తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు ఎండకు తిరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగులకు హోమియో మందులు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ లక్ష్మీబాయి, కృష్ణప్రియ, ప్రభుత్వ హోమియో వైద్యశాల ఫార్మసిస్టు కె.సుదర్శన్ రెడ్డి, సిబ్బంది శాంతమ్మ, మానవ హక్కుల సంఘం దక్షిణ భారత కార్యదర్శి ఆవుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తాగుబోతు వీరంగం

- సీఎంఓ, హౌస్‌సర్జన్‌పై చేయిచేసుకున్న వైనం
- భయాందోళనకు గురైన వైద్యులు, ఇతర సిబ్బంది

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో మంగళవారం అర్ధరాత్రి ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు.. తన కుడి చేతికి గాయమైందని నగరానికి చెందిన ఓ వ్యక్తి అర్ధరాత్రి క్యాజువాలిటీకి (ఎమర్జెన్సీ వార్డు)కు వచ్చాడు. తాగిన మైకంలో ఉన్న తాగుబోతు క్యాజువాలిటీకి వచ్చిన ప్పటి నుంచి దుర్భాషలాడుతూ ఉన్నాడు. విధుల్లో ఉన్న హౌస్‌సర్జన్ రోహిత్‌తో వాగ్వాదానికి దిగాడు. చివరకు హౌస్‌సర్జన్‌పై చేయి చేసుకున్నాడు. అదే సమయంలో విధుల్లో ఉన్న క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్ తాగుబోతును సముదాయించేందుకు వెళ్లారు. అయితే డాక్టర్ శ్యామ్‌ను తోసేసే ప్రయత్నం చేశాడు. కాసేపటికి అక్కడికి చేరుకున్న పోలీసులు తాగుబోతును స్టేషన్‌కు తరలించారు. ఇదే విషయమై సీఎంఓ డాక్టర్ శ్యామ్, హౌస్‌సర్జన్ రోహిత్ బుధవారం ఉదయం ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలతకు ఫిర్యాదు చేశారు. క్యాజువాలిటీలో రాత్రి సమయంలో తరచూ ఆకతాయిలు వైద్యులు, సిబ్బంది పట్ల దుర్భాషలాడుతుండటం పరిపాటిగా మారిపోయిందన్నారు. టూటౌన్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాత్రి వేళలో ఆస్పత్రి పరిసరాల్లో గస్తీ చేపట్టాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

'పరిటాలలవి స్వార్థ రాజకీయాలు'

రామగిరి: గత 30 ఏళ్లుగా మంత్రి, ఎమ్మెల్యే పదవులు అనుభవిస్తూ బడుగు, బలహీన వర్గాలను మోసం చేసింది మీరుకాదా అని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరిటాల కుటుంబాన్ని ప్రశ్నించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలపై కేసులు పెట్టించారని మాజీ మంత్రి పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలను పార్టీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, జెడ్పీటీసీ నాగార్జున ఖండించారు. పరిటాల కుటుంబం అధికారంలో ఉండి పేదలకు చేసిందేమీ లేదన్నారు. అప్పట్లో ఆర్వోసీ పేరుతో బడుగు బలహీన వర్గాలు (బోయ, కురబ, మాదిగ) వంచించారని ఆరోపించారు. మీ స్వార్థం కోసం వారిని వాడుకొని పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కులం, మతం, పార్టీ తేడా లేకుండా పథకాలు అందిచారన్నారు. టీడీపీ కూటమి ఇచ్చే హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలను రెచ్చగొట్టినా వారు ఏమాత్రం నమ్మరన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా ప్రకాష్‌రెడ్డిని మరోసారి ప్రజలు దీవిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, చెన్న కేశవరెడ్డి, రామ్మూర్తి, సిద్దన్న మండల అగ్రీ బోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, జనార్దన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అల్లా ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని మసీదులో ఇఫ్తారు విందు కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపవాసదీక్షాపరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజజ పరమ పవిత్రమైన రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు విరమణ సమయంలో జరిగే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం మసీదు ఇమామ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు చిత్రా వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, జయన్న, ముస్లిం, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

అనంతపురం కల్చరల్: తపోవనంలోని శివశక్తిసాయి దేవాలయంలో ఈనెల 17న సాయిట్రస్టు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు ఎన్నికల ప్రచారం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారని జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి, కన్వీనర్ నర్శిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం చిన్నపురెడ్డిపల్లి నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం కనుముక్కల, ఓబుళంపల్లి, ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, వెల్దుర్తి, గంగినేపల్లి తండాలు, అడవి బ్రాహ్మణపల్లి, ఎర్రోనిపల్లి, గంగినేపల్లి, ఎర్రోనిపల్లి తండాల్లో ప్రచారం కొనసాగుతుందని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రచారానికి తరలిరావాలని రారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని ఆదర్శనగర్ కొట్టాలలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న 7 మందిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.7,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అదిగో నెలవంక..



ఆత్మకూరులో కనిపించిన నెలవంక

ఆత్మకూరు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను గురువారం జరుపుకోనున్నారు. బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో మసీదు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నెలవంకను చూసిన అనంతరం ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు చేశారు. దువా పఠించారు. గురువారం ముస్లింలంతా పెద్ద ఎత్తున ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్ చేస్తామని మతపెద్దలు తెలిపారు.



నెలవంకను చూపిస్తున్న ముస్లింలు

కరుణించమ్మా.. సల్లాపురమ్మా



అలంకరణలో సల్లాపురమ్మ దేవత

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో బుధవారం సల్లాపురమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజుల పాటు గ్రామస్తులు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులను తీర్చుకుంటారు. ఆలయంలో అమ్మవారికి మొదటి రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ రోజు గురువారం శివుని జాతర (పార్వేట) నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ఆణిముత్యాలు అనే ఉచిత నాటకాన్ని ప్రదర్శిస్తారు. మూడో రోజు శుక్రవారం సల్లాపురమ్మ జాతర (పార్వేట) నిర్వహిస్తారు. అదే రోజు కూడా నవరత్నాలు అనే చిత నాటకాన్ని ప్రదర్శిస్తారు. అలాగే అదే రోజు రాత్రి శ్రీ సీతారామ చెక్క భజన గజ్జెల పూజ నిర్వహిస్తారు. నాలుగో రోజు శనివారం ఆంజనేయస్వామి జాతర (పార్వేట) జరుగుతాయి. ఆలయ ప్రాంగణంలో ఇనుప గ్రిల్ క్యూలైను, ప్రత్యేకంగా తాగునీరు, ప్రసాదం అందించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు.

ఇదీ ఆలయ చరిత్ర..

ఎం.బండమీదపల్లి గ్రామం ఏర్పడగానే సల్లాపురమ్మ దేవత గ్రామ నడిబొడ్డున వెలసి పూజలందుకుటోంది. ఒక రోజు గ్రామంలోని పశువుల కాపరులు గ్రామ చివరలో ఉన్న చెరువులో ఎలుకలు పట్టడానికి రంధ్రాలు తవ్వుతుండగా ప్రతి సారి ఒక రాయి రంధ్రానికి అడ్డుపడుతూ ఉండేది. ఆ రాయిని ప్రతి సారీ తీసివేయడం, మరలా అడ్డుపడటం జరుగుతుండేది. ఆ రాయిని తీసివేయడం వల్ల సల్లాపురమ్మ దేవత ఒక బాలుడి ఒడిలోకి వచ్చి నేను సల్లాపురమ్మను రా.. మీ గ్రామానికి వచ్చాను.. నన్ను చెరువు సమీపంలో ప్రతిష్ఠించండి.. మీ గ్రామాన్ని చల్లగా చూస్తానని చెప్పింది. దీంతో గ్రామస్తులు అప్పటికప్పుడు సల్లాపురమ్మ దేవతను చెరువు పై భాగాన చిన్న రాతి గుడిలో ప్రతిష్ఠించారు. అక్కడ ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో కొన్నేళ్లకు ఆలయాన్ని నిర్మించారు. అక్కడే అమ్మ వారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు.

సైగలకు మాటలొచ్చాయి



న్యాయవాది **అడ్వా సారా సన్ని** భారతదేశపు మొట్టమొదటి వినికిడి లోపం గల రిజిస్టర్డ్ ప్రాక్టీసింగ్ లాయర్‌గా చరిత్ర సృష్టించారు. ఏప్రిల్ 4న ఆమెకు సహాయం చేయడానికి సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫైడ్ ఇంటర్‌ప్రెటర్ సేవలను పొందాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్ 8న కర్ణాటక హైకోర్ట్ రిజిస్టర్డ్ సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడి లోపం ఉన్న న్యాయవాది నుంచి వాదనలు విన్నది. దీంతో అడ్వకేట్ సారా సన్నీతోపాటు కర్ణాటక హైకోర్ట్ కూడా దివ్యాంగులకు ఒక గొప్ప బాసటగా నిలిచినట్లయింది. ఇది న్యాయ నిపుణులకు మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న పౌరులకు కూడా సమగ్ర న్యాయవ్యవస్థకు మార్గం మరింతగా సుగమం చేస్తుంది.

జస్టిస్ ఎం నాగప్రసన్న, అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ అడ్వా సన్నీ నమోదును ప్రశంసించింది. ఏఎస్‌జీ కామత్ మాట్లాడుతూ 'ఇంటర్‌ప్రెటర్ ద్వారా హియరింగ్, స్పీచ్ ఇంపెయిర్డ్ అడ్వకేట్ వాదనను విన్న మొదటి హైకోర్టుగా కర్ణాటక హైకోర్టు చరిత్రలో నిలిచిపోతుంది. సారా సన్నీ సంకేత భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడిలోపం, ప్రసంగం బలహీనంగా ఉండటం వల్ల కలిగే వైకల్యాన్ని ఓడించింది. అందుకు సారా సన్నీని అభినందించాల్సిందే. సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వాదప్రతివాదనలు జరిగినప్పటికీ ప్రశంసలు రికార్డులలో నమోదు అవుతాయి' అని తెలియజేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 'భారత న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాల నుండి ఎక్కువ మంది మహిళలు చేరాల'ని పదే పదే ప్రస్తావించారు.

ప్రోత్సహించడానికి... అడ్వా సారా సన్నీ కేరళలోని కొట్టాయం వాసి. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కేవలం స్వీయ ఆసక్తితో మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకుంది. అడ్వకేట్ సన్నీ ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అండ్ హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో యాక్టివ్ మెంబర్. సెప్టెంబరు 2023లో న్యాయవాది సన్నీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక కేసు వాదించిన, వినికిడి లోపం ఉన్న మొట్ట మొదటి లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంలో సన్నీ 'డీవై చంద్రచూడ్ ఓపెన్ మైండ్ ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తుల కోసం తలుపులు తెరిచింది' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సన్నీ కోర్టు సబిమిషన్స్‌లో సహాయం చేయడానికి సంకేత భాషా ఇంటర్‌ప్రెటర్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు గతంలో తన రిజిస్ట్రీని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అది అమలు అయ్యింది. వైకల్యాలున్నవారు తమ అడ్డంకులను అధిగమించడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అయ్యింది.



సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

నేడు రమజాన్

అల్లాహు అక్బర్ ..
అల్లాహు అక్బర్ ..
లాయిలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ ..!

ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి.

కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్‌లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్‌లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి.

సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిలనవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం.

రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ','ఇఫ్తార్' ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.., ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్'. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్ఠలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది.

మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్‌ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి.


దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం,'తరావీహ్ 'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం.

ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే 'ఈద్ '(పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.

ఈ కాలంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ ధనంలోని ఒక నిర్ణీతభాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' నిజానికి దానంకాదు. పేదవారి హక్కు. తమ నిల్వ ఆదాయంలోంచి నూటికి రెండున్నర శాతం తీసి దానం చేస్తారు. అలాగే ఫిత్రాలు కూడా! ఇది ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా కాస్తో కూస్తో కలిగిన వారందరూ చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమతలేని వారికి ఫిత్రా దానం వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. దీనివల్ల పేదసాదలు కూడా కొత్త బట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోగలుగుతారు. ముస్లిములు, ముస్లిమేతరులు అన్న భేద భావం లేకుండా సమాజంలోని పేద సాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. అందుకే ప్రవక్త వారు రమజాన్‌ను 'సానుభూతుల నెల' అన్నారు.

సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ర్ . – ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు.

పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్ల నుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాథాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.



ఈదుల్ ఫిత్ర్ పర్వదిన శుభాకాంక్షలు

– మదీహా అర్జుమంద్

ఘనత



కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజనీర్ **మాధవీ లత** కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యెస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం.

ఆమె నదిని దాటించింది

ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజనీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత.



● మాధవీ లత

చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్

భారతీయ రైల్వే 2004లో జమ్ము–కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజనీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.

ప్రొఫెసర్‌గా పని చేస్తూ...

ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజనీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజనీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజనీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు.

అవకాశం ఇలా...

ఉధంపూర్ – బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ అర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలు కొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజనీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్–5 భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

కంచికి వెళ్లిన కథను ఇంటికి తెద్దాం

ఒకప్పుడు మనదేశంలో ప్రతి ఇల్లూ కథాకారులను తయారు చేసే గొప్ప సాంస్కృతిక వేదిక. కథాకారులు కనీసం ఇంటికొక్కరైనా ఉండేవారు. వీధిలో ఒకరిద్దరు నిష్ణాతులుండేవారు. ఆ నిష్ణాతులు కథ చెప్పడం మొదలు పెడితే చాలు, ఆ వీధిలోని అన్ని ఇళ్లలోని పిల్లలూ అక్కడే ఉండేవాళ్లు. శ్రోతలను కట్టిపడేసేటట్లు కథ చెప్పడానికి నియమిత శిక్షణ ఉండేది కాదు. వాళ్లు కథ చెప్పడంలో ఏ యూనివర్సిటీలోనూ కోర్సు చేయలేదు. అయినా సరే... కథ పూర్తయ్యేటప్పటికి హౌస్‌ఫుల్ అన్నట్లు ఆ ఇంటి వరండా నుంచి వీధి అరుగు వరకు జనంతో నిండిపోయేది. అలాంటి కథలు ఇప్పుడేమయ్యాయి?

మాయమవుతున్న కథాకారులు

గ్రామాలు కుచించుకుపోతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. ప్రతి ఊరి నుంచి తరానికి కొందరు పట్టణాలకు వలసపోతున్నారు. పిల్లలకు కథలు చెప్పడానికి తగినంత ఖాళీ సమయం ఉన్న పెద్దవాళ్లు గ్రామాల్లో ఉండిపోవడం, పిల్లలు తల్లిదండ్రులతో నగరాలకు తరలి వెళ్లడంతో తరాలను కలిపి ఉంచిన కథ అనే అందమైన బంధం కూడా తెగిపోయింది. నగరాల్లో పిల్లలకు కథ చెప్పే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకుందామనుకుంటే డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆ అవకాశాన్ని కూడా మింగేసింది. ఆ అగాథాన్ని గుర్తించిన విద్యావ్యవస్థ పిల్లలకు కథలు చెప్పడాన్ని సిలబస్‌లో చేర్చింది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికీ కార్పొరేట్ స్కూళ్ల దగ్గరే ఉంది. ఒక విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పగలిగిన సాధనం కథ. అంతటి ప్రభావవంతమైన సాధనాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామని ఆలోచించిన గీతారామానుజమ్ కథను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు.

ఇంటింటా కథాకారులు

'కథ కంచికి మనం ఇంటికి' అని ముగించే కథను కంచి నుంచి ఇంటికి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది. కథల భాండాగారానికి పడి ఉన్న పీటముడిని విప్పుతున్నారు గీతారామానుజమ్. ఆమె వృత్తిరీత్యా శాస్త్రీయ గాయని. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్‌గా అనుభవం ఉంది. రేడియో కార్యక్రమాల సమన్వయ కర్త కూడా. ఆమె 1996లో తోలుబొమ్మలతో పిల్లలకు కథ చెప్పడం మొదలుపెట్టారు. పిల్లలు కథలకు దూరం కావడానికి కారణం నగరాలకు వలసలతో పాటు నానమ్మ– తాతయ్యలకు దూరం కావడం ఒక కారణమైతే, టీవీలు స్మార్ట్ ఫోన్‌లు అంతకంటే ప్రమాదమైన భూమిక పోషిస్తున్నాయంటారామె. కథలను తిరిగి మన జీవితంలోకి తీసుకు రావడానికి బెంగళూరులో కథాలయ ఇంటర్నేషనల్ అకాడెమీ స్థాపించారు. ఆమె క్రమం తప్పకుండా సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలు నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు. గత ఏడాది అరవైకి పైగా కథాకారులతో(కథ చెప్పేవాళ్లు) 'గాథ– ముంబయి ఇంటర్నేషనల్ స్టోరీ టెల్లింగ్ ఫెస్టివల్' నిర్వహించారు. పాతికేళ్ల ప్రయాణంలో ఆమె వేలాదిమంది కథాకారులను తయారు చేశారు. ఒక విషయాన్ని తెలియ చేయడానికి, విన్న వారిలో స్ఫూర్తిని అందించడానికి, ఉత్సాహపరచడానికి, చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడే అత్యంత ప్రభావవంతమైన సాధనం కథ. కథ చెప్పేటప్పుడు వినిపించేది గొంతు మాత్రమే. కానీ పలికేది గొంతు మాత్రమే కాదు. కథాకారుల ముఖం భావాలను పలుకుతుంది. గొంతు వాచకంతోపాటు నవరసాలను పలుకుతుంది. అంతకంటే ఎక్కువగా కళ్లు మాట్లాడతాయి. అందుకే పిల్లలు చిన్నప్పుడు విన్న కథలు వారికి వృద్ధాప్యం వరకు తోడుగా వస్తాయి. వాళ్ల మనుమలకు చెప్పేవరకు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. ఇది దండలో దారంలా పైకి కనిపించని ఒక సంప్రదాయ పరంపర. ఈ పరంపరకు అంతరాయం కలగకూడదు. ఇప్పటికే ఏర్పడిన విరామానికి తెర దించుదాం. కంచికి వెళ్లిపోయిన కథను తిరిగి ఇంటికి తీసుకువద్దాం. 'అనగనగా ఒక రాజు' అంటూ కొత్త కథలను చెబుదాం. ప్రతి ఒక్కరం కథాకారులమవుదాం. పిల్లలున్న ప్రతి ఇంటినీ కథల నిలయంగా మారుద్దాం.



● కథకారిణి గీతా రామానుజమ్



● చిన్నారులకు కథలు చెబుతున్న ట్రైనర్



● ఆసక్తిగా వింటున్న ప్రేక్షకులు

